నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట







ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. పార్టీ జెడ్పీ చైర్మన్లతో మంగళవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి కుటుంబసభ్యులతో కేసీఆర్, మాజీ మంత్రి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పేదలకు సేవచేసే అదృష్టం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

## గద్వాల జిల్లాలో బస్సులు వెళ్లని గ్రామాలు

**గద్వాల మండలంలో..**

చెనుగోనిపల్లి, కొత్తపల్లి, మేళ్లచెరువు, కాకులారం, ఈడిగోనిపల్లి, కుర్వపల్లి, పర్మాల, పూడూరు తదితర గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో వీరు తమ గ్రామాల నుంచి సుమారు 2 కిలోమీటర్ల మీర స్టేజీ వరకు వచ్చి బస్సులు ఎక్కి సమీప పాఠశాలలకు వెళ్తుండగా మరికొంతమంది విద్యార్థులు సైకిళ్లపై వెళ్తున్నారు.

**గట్టు మండలంలో..**

తారాపురం, జోగన్‌గట్టు, సల్కాపురం, గంగిమాన్‌దొడ్డి, సోంపురం, కుచ్చినెర్ల, జోహారపురం, రాయపురం, ఎల్లందొడ్డి గ్రామాలకు చెందిన విద్యార్థులు ఉన్నత పాఠశాల చదువులు చదవాలంటే గట్టు లేదా మాచర్లకు వెళ్లాలి. వీరు సుమారు మూడు కిలోమీటర్ల మేర కాలినడకన లేదా సైకిళ్లు ఆటోల్లో స్కూల్‌కు వెళ్తున్నారు.

**ధరూర్ మండలంలో..**

కోతులగిద్ద, కొత్తపాలెం, జీరబండ, గుర్రంపల్లి, చిన్నపాడు విద్యార్థులు వారి గ్రామాల స్టేజీ వరకు వచ్చి ధరూర్ ఉన్నత పాఠశాలకు వెళ్తున్నారు.

**కేటీదొడ్డి మండలంలో..**

చాలా గ్రామాలకు బస్సు సౌకర్యం లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతూ మండలకేంద్రంతోపాటు నందిన్నెలోని ఉన్నత పాఠశాలకు వెళ్లాల్సిన పరిస్థితి. ఎర్సన్‌దొడ్డి, సుల్తాన్‌పురం, కుచ్చినెర్ల, గువ్వలదిన్నె, పాగుంట, పాతపాలెం, మైలగడ్డ, రంగాపురం గ్రామాల విద్యార్థులు ఐదు కిలో మీటర్ల మేర కాలినడకన, ఆటోల్లో వచ్చి నందిన్నె, చింతలకుంటల్లోని పాఠశాలలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు.

**మల్దకల్ మండలంలో..**

నాగర్‌దొడ్డి, విఠలాపురం, కుర్తిరావులచెర్వు, అడవిరావులచెర్వు, చిప్పదొడ్డి విద్యార్థులు వారి గ్రామం నుంచి సుమారు మూడు కిలోమీటర్లు స్టేజీ వద్దకు వచ్చి మల్దకల్‌లోని పాఠశాలకు రావాల్సిన పరిస్థితి ఉన్నది.

**అలంపూర్ నియోజకవర్గంలో..**

అలంపూర్ మండలంలోని ర్యాలంపాడు, జిల్లెలపాడు, సుల్తానాపురం, రాజోళి మండలం తూర్పు గార్లపాడ్, పడమటి గార్లపాడ్, మాన్‌దొడ్డి, మానవపాడులో కొర్విపాడ్, చిన్నపోతులపాడు, పెద్దపోతులపాడు, ఇటిక్యాలలోని వావివాల, షాబాద్, ఉండవెల్లి మండలంలోని కంచుపాడ్, తక్కశిల, ప్రాగటూర్, శేరిపల్లి, మారమునగాల, భైరాపురం, బస్వాపురం, అయిజలోని సంకాపురం, ఈడ్గోనిపల్లి, రాజాపురం, కొత్తపల్లి, కిసాన్‌నగర్, ఉప్పల, ఉప్పలక్యాంప్, జడ్‌దొడ్డి, గుడిదొడ్డి, రాజాపురం గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. దీంతో విద్యార్థులు నడిచి, ఆటోల్లో వెళ్లి ఉన్నత చదువులు సాగించాల్సి వస్తున్నది.



తుప్పత్రాల నుంచి ఉత్తనూర్‌కు బొలెరోలో వస్తున్న విద్యార్థులు



# విద్యార్థుల బడి పాట్లు

- ఉన్నత విద్య చదవాలంటే నడకే మార్గం
- ప్రాథమిక విద్యకే సగం మంది పరిమితం
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం

గద్వాల, జూలై 2 : బడులు ప్రారంభమైన తరుణంలో విద్యార్థులకు కష్టాలు తప్పడం లేదు. ప్రస్తుతం సమాజంలో చదువుకుంటేనే విలువ, గౌరవం ఉంటుంది. అయితే జిల్లాలో వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడానికి ప్రభుత్వం సరైన రవాణా సౌకర్యాలు కల్పించక పోవడంతో చాలా మంది విద్యార్థులు చదువును మధ్యలోనే నిలిపి వేస్తున్నారు. జిల్లాలో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి చేసిన తర్వాత హైస్కూల్‌కు వెళ్లాలంటే విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. సమీప పాఠశాలలకు వెళ్లాలంటే రెండు నుంచి మూడు కిలోమీటర్లు నడవాల్సిన పరిస్థితి నెలకొన్నది. మరికొంత మంది విద్యార్థులు వారి గ్రామ సమీపంలో ఉన్న స్టేజీ వరకు కాలినడకన, ఆటోలపై వచ్చి బస్సుల ద్వారా వారు చదివే పాఠశాలలకు వెళ్తున్నారు. గట్టు వంటి మండలంలో సీడ్ పత్తి సీజన్ సమయంలో సుమారు రెండు నెలలు పాటు విద్యార్థులు పాఠశాల కళాశాలలకు వెళ్లడం లేదు. సౌకర్యాలు లేక కొంతమంది విద్యార్థులు చదువును మధ్యలోనే ఆపి పొలంబాట పడుతున్నారు.



రాజపురం నుంచి పులికల్‌కు విద్యార్థుల కాలినడక

ప్రతి ఏడాది అధికారులు బడిబాట చేపట్టి బడికి రాకుండా పనికి వెళ్లే విద్యార్థులను స్కూళ్ల వైపు తీసుకెళ్తున్నా వారు తిరిగి పనులకు వెళ్తున్నారు. జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు ఉండగా సుమారు 100కుపైగా గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు బడులకు వెళ్లడానికి నానా అవస్థలు పడుతున్నారు. ఇదే అదునుగా భావించిన ప్రైవేట్ పాఠశాలల యజమానులు బస్సులు తిరగని గ్రామాలకు తమ బస్సులను పంపి విద్యార్థులను తమ పాఠశాలల్లో చేర్చుకుంటున్నారు. జిల్లాలో మొత్తం 461 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఇందులో 285 ప్రాథమిక పాఠశాలలు ఉండగా అందులో 23,712 మంది విద్యార్థులున్నారు. 81 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 10,702 మంది, 94 ఉన్నత పాఠశాలల్లో 26,562 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అయితే ఇందులో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో ఆయా మండలాల్లో పరిధిలోని గ్రామాలకు బస్సులు వెళ్లకపోవడంతో ఆయా గ్రామాల విద్యార్థులు సమీప పాఠశాలలకు కాలినడకన, ఆటోలు, సైకిళ్లపై వ్యయ ప్రయాసాలకోర్చి చదవుకోవడానికి వెళ్తున్నారు.

## తప్పని అవస్థలు



గద్దెగూడెం నుంచి పాఠశాలకు ప్రమాదకరంగా ఆటోలో వెళ్తున్న విద్యార్థులు

దేవరకద్ర, జూలై 2 : మండలంలోని మీనుగోనిపల్లి, బస్వాయిపల్లి, బస్వాపూర్, నార్లోనికుంట, వెంకటయ్యపల్లి, గద్దెగూడెం, వెంకటాయపల్లి తదితర గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. దీంతో ఆయా గ్రామాలకు చెందిన విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలంటే సమీప గ్రామాలకు కాలినడకన లేదా ఆటోల్లో ప్రయాణించి చదువుకోవాల్సిన పరిస్థితి ఉన్నది. అయితే ఆర్థిక స్థోమత అంతంత మాత్రంగానే ఉన్న విద్యార్థులు ప్రాథమిక విద్యకే పరిమితం అవుతున్నారు. అయితే ప్రభుత్వం ఆయా గ్రామాలకు ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సు సౌకర్యం కల్పిస్తే మిగతా వారు కూడా చదువుకొనే అవకాశం ఉందని, ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, ప్రజలు కోరుతున్నారు.

- వివిధ రూట్లకు రాకపోకలు బంద్
- కిలోమీటర్ల కొద్దీ స్టూడెంట్స్ కాలినడక..
- సైకిళ్లపై విద్యాసంస్థలకు రాకపోకలు
- ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న వైనం
- ఉమ్మడి జిల్లాలో నిరుపేద విద్యార్థులకు ప్రాణసంకటంగా మారిన ప్రయాణం



సీఎం సొంత ఇలాకా (కోస్గి బస్టాండ్)లో సరిపడా బస్సులు లేక ఎక్కేందుకు పోటీపడుతున్న విద్యార్థులు

# పల్లెవెలుగులేవీ?

- సీఎం సొంత జిల్లాలో సరిపడా లేని బస్సులు
- బడి విద్యార్థులకు తప్పని బాధలు
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో తీవ్ర కొరత

మహబూబ్‌నగర్, జూలై 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అసలే పేద విద్యార్థులు.. చదువుకునే ఆకాంక్షతో మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాల్లో సర్కారు బడుల్లో చదువుతున్నా.. సమయానికి గ్రామాల నుంచి బస్సులు లేక అవస్థలు పడుతున్నారు.. 8:45 గంటలకు స్కూల్‌కు రావడానికి పొద్దున్నే ఐదు గంటలకు లేచి.. టిఫిన్ బాక్స్ చేతిలో పట్టుకొని బరువు పుస్తకాలతో కాలినడకన బయలుదేరుతున్నారు.. ఆటోలు, ప్రైవేట్ వాహనాల్లో వెళ్లేందుకు స్థోమత లేక కిలోమీటర్ల కొద్దీ కాలినడకన పాఠశాలలు, కళాశాలలకు వస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో ఈ పరిస్థితి దాపురించింది.. కొత్త సర్కారు అధికారంలోకి వచ్చాక మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇవ్వడంతో విద్యార్థులకు బస్సులు దూరమయ్యాయి. సమయానికి బస్సులు రాకపోవడంతో విద్యార్థులు ఉదయం, సాయంత్రం కాలినడకన బయలుదేరి పట్టణాలకు చేరుకొని చదువుకుంటున్నారు. రాత్రి అయితే కాళ్ల నొప్పులతో బాధపడుతూ తల్లిదండ్రులకు చెప్పుకొని ఏడుస్తున్నారు.. ఇది నిత్యకృత్యమైంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 8 ఆర్టీసీ డిపోల్లో ఉన్న పల్లె వెలుగు బస్సులు సమయానికి రాకపోవడంతో వేలాది మంది విద్యార్థులు తమ గమ్యస్థానాల నుంచి పాఠశాలలకు నడిచి వస్తున్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చాలా మంది పిల్లలకు గిఫ్ట్ ఏ స్మైల్ కింద పేద విద్యార్థినులకు సైకిళ్లను అందజేసినా ప్రస్తుతం చాలామంది విద్యార్థినులు సైకిళ్లు లేక కాలినడకన బయలుదేరుతున్నారు. గతంలో విద్యార్థుల కోసం పల్లెవెలుగు బస్సులు ప్రత్యేకంగా నడిపేవారు. ఈ ఏడాది పాఠశాలలు ప్రారంభమైనప్పటి నుంచి బస్సులు సరిగా లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. ఎన్నోసార్లు బస్సుల కోసం తల్లిదండ్రులు సైతం ధర్నాలు చేసినా.. ఆర్టీసీ అధికారులకు విన్నవించినా.. పట్టించుకునే వారే కరువయ్యారని వాపోతున్నారు. ఫలితంగా స్కూళ్లకు సరైన సమయానికి చేరుకోలేకపోతున్నామని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. కొంతమంది కాలినడకన వెళ్లలేక చదువుకు దూరమయ్యే పరిస్థితి దాపురించింది.

పేద విద్యార్థులు కాలినడకన వెళ్తుంటే మరికొంతమంది విద్యార్థులు ప్రైవేటు బస్సుల్లో ప్రైవేట్ స్కూళ్లకు వెళ్తున్న దృశ్యాలు కలిచివేస్తున్నాయి. విద్యార్థుల అవస్థలపై 'నమస్తే తెలంగాణ' ప్రతినిధులు మంగళవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బస్సులు లేక కాలినడకన వస్తున్న విద్యార్థుల అవస్థలపై ఫోకస్ పెట్టింది. అన్ని జిల్లాల్లో ఇదే పరిస్థితి కండ్లకు కట్టినట్లు కనిపిస్తోంది. పేరుకే ముఖ్యమంత్రి సొంత జిల్లా అయిన పేద విద్యార్థుల అవస్థలు పట్టించుకునే నాథుడే లేడనే విమర్శలు వస్తున్నాయి.



కొత్తపల్లి నుంచి గద్వాలకు..



గద్వాల జిల్లా అంతంపల్లి నుంచి ఉత్తనూర్ పాఠశాలకు సైకిల్‌పై వెళ్తున్న విద్యార్థినులు



మదనపల్లి నుంచి గద్వాలకు ట్రాక్టర్‌పై వెళ్తున్న విద్యార్థినులు



కెపాసిటీకి మించి ప్రయాణం

గుంటిపల్లి నుంచి గద్వాలకు ఆటోలో ప్రమాదకరంగా వెళ్తున్న విద్యార్థులు



మహబూబ్‌నగర్ కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులు

## ఉద్యోగాలను భర్తీ చేయాలి

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 2 : ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగులను ఆదుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివప్రసాద్ డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ కలెక్టరేట్ ఎదుట ఏబీవీపీ పాలమూరు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగాల పేరుతో కాంగ్రెస్ ఓట్లు దండుకున్నదని.., అధికారంలోకి వచ్చాక వారిని విస్మరించిందన్నారు. ప్రజా ప్రభుత్వం అంటూ గొప్పలు చెప్పడం తప్పా చేసిందేమీ లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ నిర్వహించి 24 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న 2 లక్షల ఉద్యోగాల నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శివసాగర్, అరుణ, కార్తీక్, వరుణ్, సిద్ధు, సాయి పాల్గొన్నారు.

## బల్కంపేట ఎల్లమ్మకు గద్వాల చీర

గద్వాల అర్బన్, జూలై 2 : ఆషాఢమాసంలో నిర్వహించే బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కల్యాణోత్సవాన్ని పురస్కరించుకొని గద్వాల చేనేత కార్మికులు చీర సమర్పించడం ఆనవాయితీ. మంగళవారం జిల్లా కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలో చేనేత కార్మికుడు నివాసంలో సంప్రదాయబద్ధంగా చేనేత తయారీకి ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి ప్రత్యేక పూజలు చేసి చీర తయారీని ప్రారంభించారు. ఈ సందర్భంగా బండ్ల జ్యోతి మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలు సంతోషంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సాయిశ్యాం రెడ్డి, సతీశ్, గోవింద్, ధర్మనాయుడు, ఓంప్రకాశ్, కురుమన్న, మహేశ్ తదితరులు ఉన్నారు.



చీర తయారీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి

# నడకయాతన..

- వనపర్తి జిల్లాలో 80 గ్రామాలకు బస్సు సౌకర్యం కరువు
- 1,400 మంది విద్యార్థులకు తప్పని అవస్థలు
- నిత్యం 2 నుంచి 5 కిలోమీటర్ల దూరం కాలినడక



కొత్తకోట మండలం రామనంతపురం నుంచి పాలెంకు కాలినడకన వెళ్తున్న విద్యార్థులు

వనపర్తి, జూలై 2 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో వివిధ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా ఐదు కిలోమీటర్లు రోజూ నడిచి వెళ్లి చదువును కొనసాగించాల్సి వస్తున్నది. ఆర్టీసీలో విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం ఉన్నది. జిల్లాలో చాలా గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రతిరోజూ 1400 మందికి పైగా విద్యార్థులు నడకతో నరకయాతన అనుభవిస్తున్నారు. జిల్లాలో ఒకటి నుంచి పది వరకు 736 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిలో 48,127 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. జిల్లాలో 255 గ్రామ పంచాయతీలుండగా వీటితోపాటు మరో 50 వరకు చిన్న గ్రామాలు ఉంటాయి. అయితే గ్రామ పంచాయతీలుగా ఉన్న గ్రామాలకు కూడా ఇప్పటికీ చాలా వరకు ఆర్టీసీ బస్సులు వెళ్లడం లేదు. బీటీ రోడ్లున్నా.. గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. గతంలో ఎవరైనా మా గ్రామానికి బస్సు నడపాలని కోరితే.. రోడ్లు బాగా లేవని చెప్పేవారు. ఇప్పుడు అడుగుతుంటే బస్సులు లేవని.. ఉన్నా బాగాలేవని సమాధానం చెబుతున్నారు. దీంతో ఆర్టీసీ రవాణా లేని గ్రామాల ప్రజలు, విద్యార్థులు నిత్యం అవస్థలు పడుతున్నారు. వనపర్తి జిల్లాలో బస్సు సౌకర్యం లేని గ్రామాలు నేటికీ 80 వరకు ఉన్నాయి. వీటిలో చాలా గ్రామాలకు బీటీ రోడ్డు సౌకర్యం ఉంది. కొన్ని గ్రామాలకు మాత్రమే మెటల్ రోడ్లున్నాయి. ఈ గ్రామాల్లోని ప్రజలంతా ప్రైవేట్ రవాణాపై ఆధారపడుతున్నారు. నిత్యావసర సరుకులకు వెళ్లాలన్నా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనారోగ్యం బారిన పడినా అవస్థలు తప్పడం లేదు. చిన్న పిల్లలు, వృద్ధులకు ఏ అవసరం వచ్చినా ప్రయాణం నల్లేరుమీద నడకే అవుతున్నది. సొంతంగా రవాణా సదుపాయాలు ఏర్పాటు చేసుకుంటే తప్పా మరో మార్గం కనిపించడం లేదు.

జిల్లాలో ప్రతిరోజూ దాదాపు 1,465 మంది విద్యార్థులకు బస్సు ప్రయాణం అందడం లేదని అనధికార అంచనా. 80 గ్రామాల్లో వివిధ స్థాయిలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు బడికి వెళ్లాలంటే నరకయాతన అనుభవించాల్సిందే. వీరిలో కొందరు సైకిళ్ల మీద ఆధారపడితే, మరికొందరు ప్రైవేట్ ఆటోలను ఆశ్రయిస్తున్నారు. మిగిలిన వారంతా కాలినడకతోనే విద్యాభ్యాసానికి వెళ్లక తప్పడం లేదు. రెండు కిలోమీటర్ల నుంచి 5కిలోమీటర్ల వరకు కాలినడకన బడికి వెళ్లే పరిస్థితులు ఇంకా కొనసాగుతున్నాయి. ఇలా ఒకరోజు కాదు.. రెండు రోజులు కాదు.. ఏడాదంతా కాలినడకన వెళ్లాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో ప్రైవేట్ బడుల యాజమాన్యాలు బస్సులను పంపించి విద్యార్థులను ప్రైవేట్ బడులకు తీసుకువెళ్తున్నారు. పేద విద్యార్థులంతా నడకపైనే ఆధారపడి ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి చదువు సాగించాల్సిన దుస్థితి దాపురించింది.



వనపర్తి మండలం అమ్మతాపురం, రాజనగరం నుంచి జగత్‌పల్లి ఉన్నత పాఠశాలకు కాలినడకన వెళ్తున్న విద్యార్థులు

**వనపర్తి జిల్లాలో వివరాలు**

| మండలం | బస్సులు వెళ్లని గ్రామాలు | నడిచి వెళ్లే విద్యార్థులు |
|---|---|---|
| ఆత్మకూరు | 6 | 50 |
| అమరచింత | 1 | 25 |
| గోపాల్‌పేట | 5 | 100 |
| కొత్తకోట | 5 | 260 |
| పెద్దమందడి | 6 | 60 |
| పెబ్బేరు | 8 | 100 |
| పాన్‌గల్ | 7 | 110 |
| ఖిల్లాఘణపురం | 8 | 150 |
| రేవల్లి | 3 | 50 |
| శ్రీరంగాపురం | 3 | 50 |
| వీపనగండ్ల | 7 | 150 |
| చిన్నంబావి | 6 | 60 |
| మదనాపురం | 2 | 50 |
| వనపర్తి | 13 | 250 |
| **మొత్తం** | **80** | **1,465** |

## కిలోమీటర్ల మేర నడవాల్సిందే..

వనపర్తి జిల్లా కొత్తకోట మండలం రామనంతపురం గ్రామంలో 5వ తరగతి వరకు సర్కారు పాఠశాల ఉన్నది. ఇక ఆరో తరగతి నుంచి పదో తరగతి చదవాలంటే పాలెం గ్రామానికి మూడు కిలోమీటర్లు నడవాల్సిందే. ప్రతి రోజూ దాదాపు 30 మంది విద్యార్థులు కాలినడకతోనే పాలెంకు వెళ్లి చదువుకుంటున్నారు. ఇక ఇదే గ్రామంలో ప్రైవేట్ బడుల్లో చదువుతున్న విద్యార్థులను ఆయా పాఠశాలల బస్సుల ద్వారా తీసుకెళ్లడం జరుగుతున్నది. ఇలా సర్కారు బడులను నమ్ముకున్న పేద విద్యార్థులు నడుచుకుంటూ వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి కొనసాగుతున్నది.